క్లుప్తంగా

పద్మావతీ అమ్మవారికి ఊంజల్ సేవ


ఉయ్యాల సేవలో పద్మావతీ అమ్మవారు

నారాయణవనం: పద్మావతీ అమ్మవారు శుక్రవారం సాయంత్రం ఊంజల్ సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలు చేశారు. ఉదయం 7 గంటలకు వేంకటేశ్వరస్వామికి, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి శుక్రవారం అభిషేకాలు పూర్తి చేశారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు నిర్వహించిన అర్చకులు తిరుచ్చి వాహనంపై పద్మావతీ అమ్మవారిని సుందరంగా అలంకరించి, అధిష్ఠింపజేశారు. అంతర్ ప్రాకారంలో ఊరేగిన అమ్మవారికి ఊంజల్ మండపంలో ఉయ్యాల సేవ నిర్వహించారు. పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జిత అధికారి భరత్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రుచికరమైన భోజనం అందించారు


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాల్లో అమలు అవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు పెట్టాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. ఆయన శుక్రవారం మండలంలోని కాటూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. సరైన భోజనం పెట్టకపోతే చర్యలు తీసుకుంటామని వంట నిర్వాహకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ వేంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు పాసుల పంపిణీ


విద్యార్థినికి పాసు అందజేస్తున్న ఆర్టీసీ అధికారి, హెచ్‌ఎం సునీత

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత బస్సు పాసుల పంపిణీ జరిగింది. పాఠశాల చుట్టుపక్కల గ్రామాలకు చెందిన విద్యార్థులు పాఠశాల ప్రారంభం నుంచి రోజు ఛార్జీలు చెల్లించి ఆటోల్లో పాఠశాలకు వెళుతూ ఇబ్బందులు పడ్డారు. విద్యార్థుల తల్లిదండ్రులు సమస్యను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీతకు విన్నవించారు. ప్రధానోపాధ్యాయురాలు మంగళం డిపో ఆర్టీసీ అధికారులతో మాట్లాడి విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు పంపిణీకి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు స్టార్ కృష్ణ, విశ్వనాథ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డయేరియా బాధితులకు మెరుగైన వైద్యం


డయేరియా బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, డీఎంహెచ్‌ఓ

నాగలాపురం: పిచ్చాటూరు మండలం, నీరువాయి హరిజనవాడలో డయేరియా బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌ఓ వైద్యాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం నీరువాయి హరిజనవాడకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి చేరుకుని బాధితులను పరామర్శించారు. గ్రామంలో డయేరియా రావడానికి గల కారణాలను అక్కడే ఉన్న వైద్యాధికారి హమీద్ ద్వారా తెలుసుకున్నారు. తిరుపతి, నగరి, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి పరిస్థితిని ఫోన్ ద్వారా తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో కూడా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం అందించేలా చూడాలని, 108 అన్ని మండలాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

ఇన్‌చార్జిలే!


వరదయ్యపాళెంలో మూతపడి ఉన్న హౌసింగ్ కార్యాలయం



హౌసింగ్ శాఖలో పర్యవేక్షణ పడకేసింది. వరదయ్యపాళెం మండలంలో హౌసింగ్ కార్యాలయంలో ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. రెండు..మూడు బాధ్యతలు అప్పగించడంతో అయనెక్కడ విధులు నిర్వహించాలో తెలియక తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. మరోవైపు ఈ భారం లబ్ధిదారులపై పడుతోంది. తెలుగుదేశం ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి మూడు నెలలు గడుస్తున్నా.. అధికారి నియామకంపై దృష్టి సారించకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోలేక ఇక్కట్లు పడుతున్నారు.

- అందుబాటులో లేని హౌసింగ్ శాఖ అధికారులు
- కార్యాలయానికి తాళాలు
- ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులు

వరదయ్యపాళెం: మండలంలో ఎంతో కీలకంగా ఉన్న హౌసింగ్ కార్యాలయంలో అధికారులు కరువయ్యారు. దీంతో నెలల తరబడి కార్యాలయం మూత పడగా ఆ శాఖ అధికారుల జాడ అసలే కనిపించడం లేదు. శాశ్వత అధికారులు లేకపోవడంతో ఇన్‌చార్జిలకు మండల హౌసింగ్ కార్యాలయ బాధ్యతలు అప్పగించారు. దీంతో జగనన్న కాలనీల్లో పక్కా ఇళ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించే నాథులే లేకుండా పోయారు. ఫలితంగా పక్కా ఇళ్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి.

గత ప్రభుత్వ హయాంలో 1300 ఇళ్లు మంజూరు

మండలంలో గత ప్రభుత్వ హయాంలో హౌసింగ్ శాఖ ద్వారా సుమారు 1300కు పైగా జగనన్న ఇళ్లు మంజూరయ్యాయి. ఈ ఇళ్లకు సంబంధించి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రధానంగా 600 పై చిలుకు ఇళ్లు నిర్మాణాలు పూర్తి కాగా, కొన్నిచోట్ల గృహ ప్రవేశాలు కూడా జరిగాయి. మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణం జరుగుతుండగా పలు రకాల సమస్యలతో లబ్ధిదారులు అధికారుల కోసం మండల హౌసింగ్ కార్యాలయం వద్ద వారెప్పుడొస్తారో తెలియక పడిగాపులు కాయాల్సి వస్తుంది. సాయంత్రం వరకు వేచి ఉన్నా అధికారులు రాక, కార్యాలయం తలుపులు తెరవకపోడంతో లబ్ధిదారులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు.

ఇన్‌చార్జి పాలనలో మండల హౌసింగ్ కార్యాలయం

మండలంలో హౌసింగ్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ ఉద్యోగ విరమణ పొందారు. దీంతో అప్పటి నుంచి ఆ పోస్టింగ్ భర్తీ కాలేదు. కొద్ది రోజుల పాటు బీఎస్‌కండ్రిగ ఏఈకి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఆ తరువాత తడ మండలం ఏఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పగా ఆయనకు సైతం డీఈగా పదోన్నతి రావడంతో ఇక మండలానికి ఏఈ పోస్టు ఖాళీ ఏర్పడింది. డీఈగా ఆయన సత్యవేడు నియోజకవర్గ వ్యాప్తంగా హౌసింగ్‌శాఖ కార్యకలాపాలు పర్యవేక్షణకే సమయం సరిపోకపోవడంతో వరదయ్యపాళెం, తడ మండలాల హౌసింగ్ శాఖ బాధ్యతలపై దృష్టి సారించి, పర్యవేక్షించడం ఆయనకు కష్టమవుతోంది.

సమావేశాలకే సరి..

ఆయన పని ఒత్తిడి కారణంగా ముఖ్యమైన సమావేశాలకు తప్ప ఇతర రోజుల్లో ఇటువైపు కన్నెత్తి చూడలేదని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం సమస్యలు చెప్పుకోవడానికి కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు గతంలో ఉండేవారని, ప్రస్తుతం వారు కూడా లేక కార్యా లయం మూతపడడం గమనార్హం. మండల హౌ సింగ్ కార్యాలయానికి దిక్కెవరంటూ లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. హౌసింగ్ ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న హౌసింగ్ ఏఈ, సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని కోరుతున్నారు.

ఏడు గంగమ్మల ఆలయ పనులు వేగవంతం చేయండి


ఆలయ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మగుడివీధిలో ఉన్న ఏడుగంగమ్మల ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కోరారు. శుక్రవారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగమ్మ జాతర డిసెంబర్‌లో రానుందని తెలిపారు. ఏ కారణంతోనో 50 రోజులుగా పనులు ఆగి ఉన్నాయన్నారు. నవంబర్ లోపు నిర్మాణ పనులు పూర్తయి కుంభాభిషేకం నిర్వహిస్తే డిసెంబరు 6న జాతర జరుపుకునే వీలుంటుందన్నారు. రానున్నది వర్షాకాలం కాబట్టి నిర్మాణ పనులను ముమ్మరం చేయాలని సూచించారు. కుంభాభిషేకం జరగకపోతే జాతర నిలపాల్సి వస్తుందన్నారు. ఒక సంవత్సరం ఆగితే మూడేళ్ల వరకు జాతర జరిపే వీలుండదని తెలిపారు. కనుక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పనులను ప్రారంభించాలని కాంట్రాక్టర్లు, అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని తెలిపారు. జాతర జరిగే లా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండండి


సత్యవేడు: పాత టైర్లలో నిలచి ఉన్న వర్షపు నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది


బుచ్చినాయుడుకండ్రిగ: మురుగునీటి నిల్వలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

సత్యవేడు: ప్రజలంతా డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్ కోరారు. మండలంలోని నరసరాజు అగ్రహారంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు . ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో ఇంటి పరిసరాల్లో నీరు నిలచి దోమలు వృద్ధి చెందుతాయన్నారు. తద్వారా జ్వరాలు పెరిగే ప్రమాదాలు ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏఎన్ఎం రోస్ లిస్ మాట్లాడుతూ వేడి చేసిన ఆహారం తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని వడపోసి తాగాలని సూచించారు. టైర్లు, పగిలిన కుండలు, నీటి తొట్టెలలో నీళ్లు తొలగించారు. సర్పంచ్ బాలాజీ, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

బుచ్చినాయుడుకండ్రిగ: సీజనల్ వ్యాధులపై బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ అవగాహన కల్పించారు. గ్రామంలోని మురుగు నీటి నిల్వలను తొలగించి, బ్లీచింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా, వైరల్ ఫీవర్లు, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే కొంత వరకు వ్యాధులను అరికట్టవచ్చునని తెలిపారు.ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు.

పాఠశాల భవనంలో గ్రామ సచివాలయం



పాఠశాల భవనం


పాఠశాలలోని సచివాలయ కార్యాలయం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆర్ అనంతాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనంలో గ్రామ సచివాలయ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో ఇక్కడి ఉపాధ్యాయుడు, విద్యార్థులు పక్క గ్రామం జీఎన్‌కండ్రిగకు వెళ్లి, పాఠశాల ఆవరణలోని ఖాళీ భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుడు, విద్యార్థులు ప్రతి రోజూ 2 కిలోమీటర్లు దూరంలో ఉన్న జీఎన్‌కండ్రిగ గ్రామంలోని పాఠశాల భవనానికి వెళ్లాల్సి వస్తోంది. సచివాలయ భవనం పూర్తి కాక పోవడంతో స్థానిక పంచాయతీ భవనంలో సచివాలయాన్ని నిర్వహిస్తుండగా, భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పాఠశాల భవనంలోకి మార్చారు. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలోనే పాఠశాలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దండి

శ్రీకాళహస్తి: గ్రామాలను ఆదర్శ పంచయాతీలుగా తీర్చిదిద్దాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రామస్వరాజ్యం వైపు అడుగులు వేస్తోందన్నారు. లక్ష్యం నెరవేరేలా పంచాయతీల కార్యదర్శులు శ్రమించాలని కోరారు. పట్టణంలోని పురపాలకసంఘ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచి, అంటు వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, జిల్లా డిప్యూటీత చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఆదిశేషాద్రి తతదితరులు పాల్గొన్నారు.

చదువు మానేసిన పిల్లల్ని బడిలో చేర్పించండి


విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యాహక్కు చట్ట ప్రకారం బడిఈడు పిల్లలు బడి బయట ఉండకూడదని, తప్పనిసరిగా బడిలో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి రవీంద్రనాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన ఉపాధ్యాయులతో కలసి కుక్కంబాకం దళితవాడలోని బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు పంపించాలని, పాఠశాలలో అడ్మిషన్ చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు.

బాలుర జూనియర్ కళాశాలకు రూ.30 వేల ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న గుడ్లూరు మయూర్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి కోరిక మేరకు ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ శుక్రవారం రూ.30 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సొమ్ముతో పశువులు ప్రవేశించకుండా గేటు ముందు క్యాటిల్ గాడ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ గతంలో కూడా ఎంజీఎం గ్రూప్ అధినేత గుడ్లూరు మల్లికార్జున నాయుడు స్టోన్ క్రషర్ యజమానులతో మాట్లాడి రూ.10 లక్షలు విలువ గల వేస్ట్ మట్టిని కళాశాల ప్రాంగణంలో వేసి చదును చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వారిని అడగానే కాటిల్‌గాడ్‌కు ఆర్థిక సాయం చేశారన్నారు. ఇందుకు ఎంజీఎం గ్రూప్స్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి: పట్టణంలోని సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ వాసురెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ సబ్‌స్టేషన్, లైన్ల మరమ్మతులు చేస్తున్న కారణంగా ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బుచ్చినాయుడుకండ్రిగలో...

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ, ట్రాన్స్‌ఫార్మర్ల నెలవారీ మరమ్మతులు, నిర్వహణ నిమి త్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరా యం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటి తెలిపారు. ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండల కేంద్రంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీ చంద్రనాయక్, ఏఈ జైసాయి తెలిపారు.తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మండల వ్యాప్తంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని, సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ పనులు కారణంగా విద్యుత్ నిలిపి వేయనున్నట్లు ఆయన తెలిపారు. నాగలాపురం ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు మండల విద్యుత్‌శాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. ఉదయం 8 నుండి 11.30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌కు సాధారణ మరమ్మతు పనుల్లో భాగంగా సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఆయన వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శుక్రవారం శ్రీసిటీ చైర్మన్ శ్రీనివాసరాజు, సినీ దర్శకుడు మలినేని గోపీచంద్, సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్, తెలంగాణ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూప్రసాదాలతో సత్కరించారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


కుసుమాంజలి


కిషోర్


హిమశ్రీ

నారాయణవనం: మండలంలోని పాలమంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు ఇడుపులపాయి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యయిని మనోహరి తెలిపారు. మార్చిలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో పాఠశాల టాపర్లుగా నిలిచిన కుసుమాంజలి(585), కిషోర్(581), హిమశ్రీ(575) ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు మనోహరి తెలిపారు. ఏటా పాఠశాల నుండి గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికవుతున్నారని తెలిపారు. ఎంపికైన కుసుమాంజలి, కిషోర్, హిమశ్రీలను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి దయానా, ధనుష్


దయానా, ధనుష్

బుచ్చినాయుడుకండ్రిగ: జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 578 మార్కులతో పాసైన దయానా, ధనుష్ అనే విద్యార్థులు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రమణయ్య తె లిపారు. ఆరు సంవత్సరాల ట్రిపుల్ ఐటీ కోర్సులో ప్రవేశానికి పాఠశాల నుంచి ఎంపికైన వీరిని ఉపాధ్యాయ బృందం అభినందించింది.

రేణిగుంటలో..




మేఘన, కావ్య, సానియా ఫాతిమా


ఎలీసా

రేణిగుంట: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నలుగురు విద్యార్థినులు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ ఇందిరాదేవి తెలిపారు. రేణిగుంట మండలం గుత్తివారిపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పి.మేఘన, ఆర్.మల్లవరం హైస్కూల్‌కు చెందిన కావ్య, రేణిగుంట బాలికోన్నత ప్లస్ హైస్కూల్ విద్యార్థిని పి.సానియా ఫాతిమా, తారకరామానగర్ హైస్కూల్ విద్యార్థిని సి.ఎలీసా ఎంపికైనట్లు ఆమె పేర్కొన్నారు. గత ఏడాది పదో తరగతి చదివిన వీరు అత్యుత్తమ మార్కులు సాధించడంతో ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థినులను ఎంఈఓతో పాటు ఎంఈఓ–2 రంగనాథ్, ఆయా పాఠశాల హెచ్‌ఎంలు అభినందించారు.

వైభవంగా పరాశరేశ్వరస్వామి కల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న రిత్వికులు

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వర ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం దేవరులకు ఆర్జిత కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పరాశరేశ్వరస్వామివారు రాత్రి అశ్వవాహనాన్ని అధిరోహించి పుర వీధుల్లో విహరించారు. ఉదయం అర్చకులు నిత్యపూజా కైంకర్యాలు పూర్తి చేశారు. పరివార దేవతలకు అభిషేకాలు, నిర్మిత హోమశాలలో హోమాలు, నైవేద్య సమర్పణ చేశారు. 10 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వరస్వామివార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించి, ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం 8 గంటలకు అయ్యప్ప భజన మందిరంలో చంపకవల్లీ, పరాశరేశ్వరస్వామివారికి ఆగమ శాస్త్రోక్తంగా ఆర్జిత కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలు, వస్త్ర బహుమానాన్ని అందజేశారు. అనంతరం అశ్వవాహనంపప పరాశరేశ్వర స్వామివారిని కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ తదితరులు పర్యవేక్షించారు. శనివారం సాయంత్రం రావణేశ్వర వాహనంపై స్వామివారు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

దివ్యాంగులకు 'అభయ'క్షేత్రం

వారంతా అనాథలు..విధి వంచితులు.. అలాగని సాయం చేయమని ఎవరినీ అడగలేరు. వారి పరిస్థితిని అర్థం చేసుకున్న ఓ స్వచ్ఛంద సంస్థ వారిని ఆదరించింది. అమ్మానాన్నగా మారి ఆలనా పాలన చూస్తూ అభయమిస్తోంది రేణిగుంటలోని అభయక్షేత్రం.



అభయక్షేత్రంలో ఆశ్రయం పొందుతున్న ప్రత్యేక ప్రతిభావంతులు, రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి అవార్డు అందుకుంటున్న తస్లీమ్ (ఫైల్)

రేణిగుంట: మానసిక, శారీరక వైకల్యత కలిగిన వారిపై రక్తసంబంధీకులే ఒకానొక సందర్భంలో ఈసడించుకుంటున్న సమాజంలో ఏ బంధం లేని ఓ మహిళ రేణిగుంటలో అభయక్షేత్రమనే గొడుగు కింద నిష్కల్మషమైన సేవలందిస్తున్నారు. 2007లో రేణిగుంట బిస్మిల్లానగర్‌లో అభయక్షేత్రం పేరిట ఓ స్వచ్ఛంద సంస్థను నెలకొల్పి అమూల్యమైన సేవలు అందిస్తున్నారు తస్లీమ్. సైకాలజీలో పీహెచ్‌డీ చేసిన తస్లీమ్ విదేశాల్లో ఉద్యోగం...రూ.లక్షల్లో జీతం ఆఫర్ చేసినా తిరస్కరించారు. అభాగ్యుల సేవయే పరమావధిగా లాభాపేక్ష లేకుండా అభయక్షేత్రాన్ని నెలకొల్పారు. ప్రస్తుతం అక్కడ 198 మంది మానసిక, శారీరక వికలాంగులు ఆశ్రయం పొందుతున్నారు. కొందరు కరుణామయుల తోడ్పాటుతో వారందరిని గుండెల్లో దాచుకుని పోషిస్తున్నారామె. వయస్సుతో నిమిత్తం లేకుండా ఆదరణ కరువైన శారీరక, మానసిక వైకల్యతతో బాధపడుతున్న వారందరిని అక్కున చేర్చుకుని ఆదరిస్తోంది. వారికి కేవలం ఆశ్రయం కల్పించి భోజనం పెట్టడంతోనే సరిపెట్టుకోకుండా వారి ఆరోగ్య పరిరక్షణ, మానసిక పరివర్తనకై రోజువారీ పలు కార్యక్రమాలను చేపడుతోంది. దీని కోసం ప్రత్యేక ట్రైనర్‌ను ఏర్పాటు చేసి, మళ్లీ మానసిక పరిపక్వత సాధించేలా ఇక్కడి వారికి ప్రత్యేక శిక్షణ తోడ్పడుతోంది. అప్పుడప్పుడూ కొందరు ఉదారభావంతో అన్నదానం చేయడం, పండ్లు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు వీరి సేవలను మరింతగా తోడ్పాటునందిస్తున్నాయి. ప్రభుత్వం ఈమె సేవలను గుర్తించి 2015లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా 'ఇన్‌స్పైరింగ్ వుమెన్ అవార్డు'ను అందించింది. మరెన్నో రివార్డులు అందుకున్నారు. అయితే ఇక్కడ ఆశ్రయం పొందుతున్న వారి కళ్లలో కనిపించే ఆనందం ముందు అవన్నీ దిగతుడుపే అంటున్నారు అభినవ నైటింగేల్ తస్లీమ్. అయిన వారి ఆదరణకు దూరమైన వారికి అభయక్షేత్రం తలుపులు ఎప్పటికీ తెరిచే ఉంటాయంటున్నారామె. ఎవరైనా అభయక్షేత్రంలో ఆశ్రయం పొందాలన్నా... అండగా నిలవాలన్నా 9291225514, 9346402089 నంబర్లు, sthasleem2010@gmail.com, www.abhayakshethram.org లను సంప్రదించాలని ఆమె కోరారు.


రేణిగుంటలోని అభయక్షేత్రం